ఓయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కుత్బుల్లాపూర్: ఓయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు కళాశాలలో బీఏ ,బీకాం, బీఎస్సీ, బీబీఏ తో పాటు ఇతర డిగ్రీ కోర్సులు 2,4,6 సెమిస్టర్ లకు సంబంధించిన పరీక్షలు మంగళవారం ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉదయం 9 గంటలకే ఆయా సెంటర్ల వద్దకు చేరుకున్నారు. ఉదయం మధ్యాహ్నం సమయంలో రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు.

12న హనుమాన్ శోభాయాత్ర

కుత్బుల్లాపూర్: హిందూవాహిని కుత్బుల్లాపూర్ బాగ్ అధ్వర్యంలో ఈ నెల 12న హనుమాన్ విజయోత్సవ్ సందర్భంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జగద్గిరిగుట్ట సలాసర్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఈ శోభాయాత్ర శ్రీనివాస్‌నగర్, రోడామేస్త్రీ నగర్, షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్, ఐడీపీఎల్ ఓం జండా వద్ద ముగుస్తుంది. ఈ శోభాయాత్రలో హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని హిందూ వాహిని సభ్యులు కోరారు.

పార్కు స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించండి

నిజాంపేట్ : ప్రగతినగర్ సాయిలక్ష్మీ లౌఅవుట్‌లోని పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకుని, ప్రజా అవసరాలకు వినియోగించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని సర్వే నెంబర్ 181,183 సాయి లక్ష్మీ లేఅవుట్‌లో ఓపెన్ ల్యాండ్‌ను 2002–2003 నుంచి గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ. 6.30లక్షలు కేటాయించి పార్కుగా అభివృద్ధి చేశారన్నారు. అయితే ఐదేళ్ల క్రితం కొందరు వ్యక్తులు సదరు స్థలంపై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించుకుని, పార్కుస్థలం బోర్డును తీసేసి, భవన నిర్మాణం కోసం హుడాకు దరఖాస్తు చేశారన్నారు. ప్రజలకు చెందాల్సిన స్థలాన్ని సద్వినియోగం చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, అరుణ్ రావు, వెంకటేష్, పి.బి.శ్రీనివాస్, ఎల్లస్వామి, ముఖేష్, రెడ్డి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని, రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు.

దీనబంధు కాలనీలో నేడు చిన్నారులకు ఆధార్ క్యాంప్

ఆల్విన్‌కాలనీ: దీనబంధు కాలనీ కమిటీ హాల్‌లో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఆధార్‌కార్డు సెంటర్ ఏర్పాటు చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ దుత్తలూరి దస్తగిరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని దీనబంధు కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్చకులకు సన్మానం



మూసాపేట: శ్రీ రామనవమి వేడుకలు విజయంతంగా ముగియడంతో మంగళవారం ఆలయ చైర్మన్ నాగిరెడ్డి ఆలయ అర్చకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాముల కల్యాణం, ఊరేగింపు, పట్టాభిషేకం తదితర పూజలు ఘనంగా జరిగాయని, అర్చకుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణసూరి, యోగనంద నరసింహాచార్యులు, రామానుజాచార్యులు, బలరామ కృష్ణులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్ష

కూకట్‌పల్లి: తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు.

ఏర్పాటు చేశారు.. వాడకం మరిచారు..

కొన్ని చోట్ల లోపల సామగ్రి మాయం.... | మూలన పడ్డ పబ్లిక్ టాయిలెట్స్ | రూ. కోట్ల ప్రజాధనం వృథా | మరికొన్ని ప్రాంతాల్లో పత్తాలేని టాయిలెట్లు



పేట్ బషీరాబాద్ బస్ స్టాప్ వద్ద...



జీడిమెట్ల డిపో వద్ద..

జగద్గిరిగుట్ట: రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ ఇప్పుడు కనిపించకుండా పోయాయి. గ్రేటర్ పరిధిలో 2021లో ప్రతి సర్కిల్‌లో సుమారు 50 పైగా పబ్లిక్ టాయిలెట్స్ (ప్రీ ఫ్యాబ్రికేటెడ్, మైల్డ్ స్టీల్ టాయిలెట్లు) నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన చేపట్టారు. అయితే కాలనీల మధ్య ఈ టాయిలెట్ల ఏర్పాటుకు స్థానికులు నిరాకరించారు. టాయిలెట్లను ఏర్పాటు విషయంలో స్థానిక ప్రజల నుండి వ్యతిరేకత రావడంతో చేసేది లేక బహిరంగ ప్రదేశాల్లో వాటిని అమర్చారు. ఇందులో భాగంగా జంట సర్కిల్‌లో (గాజుల రామారం, కుత్బుల్లాపూర్) లలో సుమారు 114 పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి అనుమతి లభించింది. వీటి నిర్వహణకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం వినియోగంలో లేని టాయిలెట్ల వద్ద అమర్చిన కుండీ, పైపులు, ట్యాంక్‌లకు ఎత్తుకెళ్లారు. కొన్ని చోట్ల టాయిలెట్లే కనిపించడం లేదు..

గాజుల రామారం సర్కిల్‌లో 8 పబ్లిక్ టాయిలెట్లను నిర్మించినా 25 లోపే వినియోగంలో ఉన్నాయి.

జగద్గిరిగుట్ట – 8, గాజులరామారం – 22, చింతల్ – 16, సూరారం – 22 టాయిలెట్లను అమర్చారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో మొత్తం 46 పబ్లిక్ టాయిలెట్లను నిర్మించినా 20 లోపు మాత్రమే వాడుకలో ఉన్నాయి...

జీడిమెట్ల – 11, రంగారెడ్డి నగర్ – 14, సుభాష్ నగర్ – 11, కుత్బుల్లాపూర్ – 10 టాయిలెట్లను అమర్చారు.

ఇప్పటికైనా ఉన్నతాధిధికారులు జోక్యం చేసుకుని ప్రస్తుతం ఉన్న పబ్లిక్ టాయిలెట్లను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.



జీడిమెట్ల విలేజ్, ప్రధాన రహదారిలో..



గిరి నగర్ ఆర్చ్ సమీపంలో..



హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డు, బీరప్పనగర్ వద్ద...

1930కు ఫిర్యాదు చేశారు.. డబ్బు తిరిగి పొందారు..

జీడిమెట్ల: ముగ్గురు వ్యక్తులు సైబర్‌క్రైం కేసుల్లో డబ్బులు పోగొట్టుకుని 1930 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసి పోలీసుల సహకారంతో వాటిని రాబట్టుకున్నారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..

వాట్సాప్ నెంబర్ హ్యాక్ చేసి..

జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఉంటున్న రంగనాయకి అనే మహిళకు విదేశాల్లో ఉంటున్న ఆమె సోదరుడి వాట్సాప్ నెంబర్ ద్వారా అత్యవసరంగా డబ్బు కావాలంటూ మేసేజ్ వచ్చింది. ఇది నిజమే అని నమ్మిన ఆమె వారు ఇచ్చిన నెంబర్‌కు రూ.99,800 పంపించింది. తర్వాత అమె సోదరుడి కాల్ చేసి అడగగా తాను కాదంటూ అతను సమాధానం చెప్పడంతో బాధితురలు వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన పోలీసులు నగదును ఫ్రీజ్ చేసి బాధితురాలికి అందజేశారు.

యూఎస్‌డీటీ ఫ్రాడ్..

పీఎస్ పరిధిలో నివాసం ఉంటున్న టిక్రామ్ బంజార్ అనే వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా క్రిప్టో కరెన్సీ కోసం రూ.87,600 చెల్లించాడు. 24గంటలు గడిచినా అతడికి క్రిప్టో కరెన్సీ రాలేదు. సదరు నెంబర్‌కు కాల్ చేయగా ఎలాంటి సమాధారం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి 1930కు కాల్ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతనికి రూ.82,131 తిరిగి రప్పించగలిగారు.

లక్కీలాటరీ పేరుతో..

జితేంద్ర కుమార్ పాత్రో అనే వ్యక్తికి గుర్తుతెలియని నెంబర్ నుండి లక్కీ లాటరీ గెలుచుకున్నారంటూ మెసేజ్ వచ్చింది. ఫోన్ నెంబర్ ద్వారా వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా ఎలాంటి ఓటీపీ రాకుండానే రూ. 1.5లక్షలు గూగుల్‌ఫే నుండి ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. మోసపోయానని గ్రహించిన సదరు వ్యక్తి వెంటనే 1930 ద్వారా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నేషనల్ సైబర్ క్రైం రిపోర్ట్ పోర్టల్ ద్వారా తిరిగి రూ.1.45 లక్షలు ఇప్పించారు.

పెట్రో ధరల పెంపు దారుణం



గ్యాస్ సిలిండర్‌లతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జగద్గిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెట్రోల్, డీజిల్ పై రూ.2 ట్యాక్స్‌ను పెంచడానికి నిరసిస్తూ మంగళవారం సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్ వద్ద గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాప్తంగా చమురు, గ్యాస్ ధరలు తగ్గుతుంటే కేంద్రంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలు ఎందుకు పెంచాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ హయాంలో బ్యారేల్ ధర రూ.120 ఉన్నప్పుడు లీటర్ పెట్రోల్ ధర రూ.65 ఉండేదని నేడు అదే చమరు బ్యారెల్ ధర రూ. 60 ఉండగా పెట్రోల్, డీజిల్ ధరలు రూ.100కు పైగా ఉన్నాయన్నారు. ధరలు తగ్గిస్తానని చెప్పి ఎన్నికల్లో గెలిచిన నరేంద్ర మోదీ మాట తప్పి ధరలను పెంచుకుంటూ పోతున్నాడన్నారు. ధరలు తగ్గించకపోతే రానున్న కాలంలో బీజేపీని గద్దె దించుతామన్నారు. జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి మాట్లాడుతూ ఇప్పటికే ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, సహదేవరెడ్డి, బాబు, జయమ్మ, ప్రమీల, కావ్య, ఇమామ్, బాలరాజు, ప్రభాకర్, వెంకటాచారి, నరసింహ, భిక్షపతి, జంబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న మున్సిపల్ గ్రౌండ్

రంగారెడ్డినగర్: క్రీడలకు కేటాయించిన మున్సిపల్ స్థలం చెత్త వ్యర్థాలతో కంపు కొడుతోంది.. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయ భవనం పక్కనే ఉన్న మున్సిపల్ గ్రౌండ్‌లో గత కొన్ని రోజులుగా చెత్త ఆటో రిక్షావాలాలు వ్యర్థాల ఎరివేత చేపడుతున్నారు. ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థాలను ఆటోరిక్షాల్లో ఇక్కడికి తీసుకువచ్చి గ్రౌండ్‌లో కుమ్మరిస్తున్నారు. అనంతరం అందులోని ప్లాస్టిక్, ఇనుము తదితర వస్తువులను వేరు చేసి సెకండరీ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్‌కు తరలిస్తున్నారు. దీంతో గ్రౌండ్‌లో ఆడుకునేందుకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు స్పందించి మున్సిపల్ గ్రౌండ్‌ల చెత్త ఆటోరిక్షాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో వ్యర్థాల మూటలు

సన్న బియ్యం అందించిన ఘనత కాంగ్రెస్‌దే



సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: దేశంలో సన్నబియ్యం అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతినగర్ సైదప్ప బస్తీలో సన్నబియ్యం లబ్ధిదారులు ఉమామహేశ్వరి, లక్ష్మణ్ ఇంట్లో ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల్లో విజయవంతంగా సన్న బియ్యాన్ని అందజేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీలను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సన్న బియ్యం అందించడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

నియోవేషన్-25లో ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ

దుండిగల్: జాతీయ స్థాయి నియోవేషన్–25లో దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నాస్కామ్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్(టీఏఎస్‌కే) సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన థింక్ క్యూబాటర్ కోహార్ట్–7లో ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు చెందిన సాయితరుణ్ నిరంజన్ విక్రమ్‌సింగ్ బృందం టెక్ ఫర్ ఫుడ్ అంశంపై ప్రదర్శించిన ప్రాజెక్టుకు రూ. 5 లక్షల సీడ్ ఫండ్ సపోర్ట్‌తో పాటు జాతీయ స్థాయి సర్టిఫికేషన్ పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందని, కళాశాలకు చెందిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి కృషి చేస్తున్నామన్నారు.



నియోవేషన్-25లో పాల్గొన్న విద్యార్థులు సాయితరుణ్, నిరంజన్

పరామర్శ



యుగేందరావును పరామర్శిస్తున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్..

కుత్బుల్లాపూర్ : ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరిత భర్త యుగేందర్రావును మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. మంగళవారం ఆయన పేట్ బషీరాబాద్ సమీపంలోని రెనోవా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యుగేందర్రావును పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 6 వద్ద వాహనం ఢీకొట్టగా ఈ ఘటన చోటు చేసుకుందని వివరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మాధురి శివాజీ రాజు, రాజిరెడ్డి, సతీష్ సాగర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కుత్బుల్లాపూర్ :కొంపల్లి డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని, మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పెద్ద బుద్దుల సతీష్ సాగర్ అన్నారు. నూతనంగా మున్సిపల్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి మున్సిపల్ అధ్యక్షుడిగా నియమించిన పార్టీ పెద్దల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. 2020 లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మాధురి శివాజీ రాజు రెండు ఓట్ల స్వల్ప మెజార్టీతో ఓడిపోగా మోహన్ రెడ్డి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయాడు. మిగిలిన నాలుగు స్థానాలు బీజేపీ కౌన్సిలర్ స్థానాలు గెలుపొందడం జరిగిందని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో బీజేపీ బలంగా ఉందని, త్వరలోనే మున్సిపల్ కార్యవర్గాన్ని ప్రకటించి వచ్చే గ్రేటర్ ఎన్నికలకు సిద్ధమవుతామన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



బాలింతలు, గర్భిణులతో సూపర్‌వైజర్ శోభ

సుభాష్‌నగర్: గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడి సెంటర్లలో ఇచ్చే పోషక చిరుధాన్యాలను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని దుండిగల్ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్ పల్లి శ్రీరామ్ నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం టీచర్ ప్రేమలత ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభారాణి పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీలో అందిస్తున్న చిరుధాన్యాలను క్రమం తప్పకుండా తీసుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

కుత్బుల్లాపూర్: రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం అందరికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూన శ్రీశైలంగౌడ్ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ ఉస్మాషాకీర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడు కందడి సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, శివ కుమార్, అంజి ముదిరాజ్, నవీన్, చందర్ నాయక్, మాధవి రెడ్డి, చంద్రకళ, రేణుక రెడ్డి పాల్గొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ, 18వ డివిజన్లలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, చిట్ల దివాకర్, కడియాల ఇందిరా, చౌదరి, ,జగదీష్ యాదవ్, కోలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, జగన్ యాదవ్, అంజి బాబు, కృష్ణ గొల్ల, రమణి, హరీష్, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. గాజులరామారంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నేత కూన శ్రీనివాస్ గౌడ్ శ్రీరామ్ నగర్ లో డివిజన్ నాయకులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పున్నరెడ్డి, బుచ్చి రెడ్డి డివిజన్ అధ్యక్షుడు ఎండి లాయక్, అంజలి యాదవ్, సంజీవ రెడ్డి, రషీద్ భేగ్, లాల్ మహమ్మద్, మధు, ప్రసాద్, ఘఫర్, బలరాం, రోహెన బేగం, లక్ష్మి పాల్గొన్నారు.

మన పార్కులను మనం కాపాడుకుందాం



పార్కులో పిచ్చి మొక్కలను తొలగింపజేస్తున్న కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: 'మన పార్కులను మనం కాపాడుకుందాం'... అన్న నినాదంతో కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మంగళవారం పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో కలిసి కొంపల్లి చెరువు సమీపంలోని పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. నిరుపయోగంగా ఉన్న ఈ పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో స్పందించిన కమిషనర్ పార్కును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు..

'ఎర్లీ బర్డ్'తో డబ్బులు ఆదా..

కొంపల్లి మున్సిపల్ పరిధిలోని వ్యాపార, వాణిజ్య, గృహ సముదాయ నిర్వాహకులు ఈనెల 1 నుంచి 30లోగా ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా ఐదు శాతం రాయితీ తో ఇంటి పన్నులు చెల్లించి రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. దీంతో సంవత్సరం ముందుగా టాక్స్ కడితే 23% ప్రయోజనం దక్కుతుందన్నారు. జూలై నెల నుండి రెండు శాతం వడ్డీతో కట్టాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎర్లీ బర్డ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఎర్లీ బర్డ్ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్‌లో పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ అందుతుందన్నారు. ప్రాపర్టీ ట్యాక్స్ వసూలులో భాగంగా బౌరంపేట్‌లోని వైజాగ్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ. 11.45 లక్షలు, బహదూర్‌పల్లిలోని ఆహ్లాద కంపెనీ 4.59 లక్షలు, గౌరీ ఆశ్రమం రూ. 1.16 లక్షలు, దొమ్మర పోచంపల్లిలోని వెల్కమ్ పరిశ్రమ 3.53 లక్షలు చెల్లించారు. ఈ అవకాశం ఏప్రిల్ 30 వరకు ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి బి ప్రభాకర్, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలకు భవనం నిర్మించండి

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించాలని కోరుతూ మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంతోమంది పేద విద్యార్థులు కొన్నేళ్లుగా రేకుల షెడ్డు కింద చదువుకుంటున్నట్లు తెలియడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కళాశాలను పరిశీలించి భవన నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య